

# స్థిత ప్రజ్ఞులు

– సిహెచ్. ఇంద్రాణి

తన సెలక్షన్ ఎలా ఉందో తెలుసుకోవటానికి తల్లిదండ్రుల గదికొస్తున్న శోభకు వారి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

".... ఈ పరిస్థితులలో వాళ్ళిద్దరికీ పెళ్ళి చెయ్యటం నాకు సుతరామూ ఇష్టం లేదండీ," అమ్మ గొంతు కంచులా మోగింది. శోభ కాళ్ళ కింద భూమి పగిలి పాతాళానికెళ్ళిన ఫీలింగ్ వచ్చింది.

"నీ పిచ్చిగాని ఈ రోజులలో అవన్నీ ఎవరు పట్టించుకుంటున్నారు వీణా? నీదంతా ఒట్టి సెంటిమెంటల్ వీక్‌నెస్. అసలు సైంటిఫిక్‌గా ఆలోచిస్తే నీ ఆలోచన కసలు ఆధారమే లేదు." నాన్నగారి గొంతు వింటూంటే పెను తుఫానులో కొట్టుకుంటున్న శోభ మనస్సులో ఏదో ఒక మూల చిన్న ఆశాదీపం వెలిగింది.

ఇంకా ఏం మాట్లాడుకుంటారో విందామని లోపలకు పోకుండా అక్కడే నిలబడి వారి మాటలు వినటానికి ప్రయత్నిస్తున్నది శోభ.

"మీరు వంద చెప్పండి, వెయ్యి చెప్పండి. నా మనస్సు ఈ పెళ్ళికి ఒప్పుకోవటల్లా. మీరన్నట్లు నేను డాక్టరునే, సైన్సు తెలిసినదాన్నే కానీ అన్నిటి కన్నా ఒక తల్లినన్న సంగతిని మర్చిపోకండి" అదే దృఢమైన స్వరం. అందులో ఆమె తీర్మానం వినిపించింది శోభకు.

నాన్నగారు తన తరఫున వాదించి ఓడిపోతున్నట్లు గ్రహిస్తున్నది శోభ. ఎంత తన సొంత తల్లిదండ్రులే అయినా ఇలా దొంగచాటుగా పొంచి వారి సంభాషణను వినటం అనాగరికత అని తెలిసినా అది తన జీవిత సమస్య కాబట్టి ఆ విషయంలో కాంప్రమైజ్ అయింది శోభ. నిజమే... జీవితంలో అన్నిటికన్నా సులభమైన పని ఆదర్శాలను ఇతర్లకు బోధించటమే. తనదాకా వస్తేనే అసలు రంగు బయటపడేది.

"కుర్రవాడు బుద్ధిమంతుడు. డాక్టర్ చదువుతున్నాడు. ఒంటరివాడు. రేపు మనం కట్టబోయే నర్సింగ్‌హోంలో చేరి అమ్మాయితో పాటు మనతోనే ఉంటాడు. కాకపోతే... మనంత ఉన్నవాడుకాదు."

భర్త మాటలలో ఆఖరి వాక్యం విన్న తల్లి ఒక్కసారి తెలెత్తింది. ఆమె ఎక్స్‌రే కళ్ళకు కూతురు గదితలుపు దగ్గర తచ్చాడటం తెలిసింది. భర్తతో మాటలు ఆపి తనకి షాక్ తగిలేలాగా" రామ్మా... లోపలకురా... నీ పెళ్ళి విషయమే మాట్లాడుకుంటున్నాం" చాలా తాపీగా నవ్వుతూ పిలిచింది శోభను.

ఆమె నిబ్బరానికీ, నిదానానికీ తండ్రీ, కూతుళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"సాయంత్రం కృష్ణను చూసొచ్చాం. కుర్రాడు ముచ్చటగా ఉన్నాడు. కానీ నేను చెప్పేదేమిటంటే.... ఇంకో ఆరునెలలో మీకు హౌస్ - సర్జన్ కోర్సు అయిపోతుంది. అంతవరకూ ఈ పెళ్ళి ఆలోచనలను వాయిదా వేసుకో. తర్వాత విషయం ఆపైన చూద్దాం. ఇక ఇద్దరూ భోజనానికి లేవండి" అని సమాధానం కోసం కూడా ఆగకుండా వంటింటి వైపుకు నడిచింది డాక్టరు వీణ.

ఆమె వెనకాలనే వెళ్ళటంకన్నా రవి, శోభలు ఇంకేం చెయ్యలేకపోయారు.

❋ ❋ ❋ ❋

డాక్టరు వీణ ఆ పట్నంలోకే పేరు మోసిన గైనకాలజిస్ట్. ఆమె భర్త రవి గొప్ప మనోతత్వ డాక్టర్. అమెరికాలో సైకియాట్రిస్ట్‌గా ప్రాక్టీసు చేసి కొన్ని లక్షలు గడించాడు. అమ్మాయి వయసుకు రాగానే మన దేశం మీద భక్తి పెరిగి ఆరేడు సంవత్సరాల క్రితమే ఈ పట్టణానికి మకాం మార్చారు. మనోతత్వ డాక్టరుగా ఈ దేశంలో తనకు గొప్ప పేరూ సంపాదనా లేకపోయినా గైనకాలజిస్ట్‌గా తన భార్య డబ్బులే గాక పేరూ ప్రతిష్టలూ రెండింతలు సంపాదిస్తున్నది. వీరి ఏకైక కూతురే శోభ.

తమకున్న పరపతితో అమ్మాయిని మెడికల్ కాలేజీలో చేర్పించారు ఆ డాక్టర్ దంపతులు. శోభ కూడా చలాకీ పిల్ల అవటంవల్ల కాలేజీలో అందరి నోట్లో నాలుకగా చలామణి అయిపోతున్నది. ఇప్పుడు ఆమె లేని స్టూడెంటు అసోసియేషన్ లేదు.... కాలేజీ ఫంక్షన్ లేదు... మీటింగులు లేవు. చదువుకునే రోజులలోనే పబ్లిక్ ఫిగర్ అయ్యింది. అది చూసిన ఆమె తల్లిదండ్రుల మనసు ఎంతో పొంగి పోయింది.

జీవితంలో తల్లిదండ్రుల క్రమ శిక్షణ వేరూ.... చదువూ... సంస్కారాలు వేరూ... వయసువేరు... అన్నట్లు శోభకూడా వయసు ప్రభావం వల్ల కృష్ణ ప్రేమలో పడింది. ప్రేమ అంటే సినిమాలలో ప్రేమలాగా డ్యూయట్లు పాడటం, పార్కుల పాలవడం కాకుండా, ఒకరి నొకరు అర్థం చేసుకుని, మనసారా దగ్గర చేరటానికి ప్రయత్నిస్తున్నారు. వీరి సంగతి డాక్టర్ దంపతులకు తెలిసి ఆరోజు సాయంకాలమే కృష్ణని చూసొచ్చారు.

❋ ❋ ❋ ❋

శోభ అసలే వయసులో ఉన్న ఆడ పిల్ల. రాత్రిళ్ళు నిద్ర పట్టదు. అందులోనూ ప్రేమలో పడ్డ పిల్ల.... అదీ భగ్నమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక శోభకు నిద్రెలా పడుతుంది? తల్లి గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నది శోభ.

తన తల్లి నిన్నటి దాకా ఎన్నో వర్ణాంతర వివాహాలు చేయించింది. వరకట్నం, కుటుంబ కలహాలతో విడిపోయిన ఎన్నో కాపురాలను కలిపింది. అటువంటి ఆమె తన సొంతకూతురి విషయంలో ఇలా నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా ఎందుకన్నదీ......

తనూ కృష్ణా ఒకే క్లాసులో చదవటం వల్ల ఇద్దరి వయసూ ఒకటే అని తన తల్లికి ఇది వరకే తెలుసు. ఎంత విదేశాలకు వెళ్ళి వచ్చిన డాక్టరయినా తమ కుటుంబ జ్యోతిష్కుడయిన రామశాస్త్రి దగ్గర తమ ఇద్దరి జాతకాల పొంతనలు చూపించి అవి బాగా కుదిరాయి అంటే ఎంతో సంబర పడింది. కృష్ణ తమ లాగా పెద్దగా ధనవంతుడు కాదని తన తల్లికి ఇదివరకే తెలుసు. ఆ మధ్య కృష్ణ బ్లడ్ డొనేషన్ చెయ్యటానికి ఆస్పత్రికి వెళితే తన తల్లి కూడా అక్కడికి వెళ్ళి అతనికి తెలీకుండా అతని బ్లడ్ గ్రూప్ ఏమిటో తెలుసుకొచ్చి తన బ్లడ్ గ్రూప్‌తో సరిపోయిందో లేదో చూసింది.

ఇలా కుటుంబ పరంగానూ, జ్యోతిష పరంగానూ, విజ్ఞాన పరంగానూ అన్ని పరీక్షలూ చేసి, ఓ.కే అయిన తర్వాతే కృష్ణను అల్లుడిగా నిర్ణయించి ఫార్మాలిటీస్ సేక్ - లాంఛన ప్రాయంగా అతని రూం కెళ్ళింది నాన్నతో. ఇంతలో ఇలా మారిందంటే కారణం ఏమిటయి ఉంటుందబ్బా?

బుర్ర అయితే వేడెక్కింది కానీ తల్లిలో వచ్చిన మార్పుకు కారణం తెలీలేదు శోభకు. ఆలోచిస్తూ నిద్రా దేవి ఒడిలోకెళ్ళింది.....

❋ ❋ ❋ ❋

"ఇదుగో మిమ్మల్నే...నేనూ అమ్మాయీ ఆస్ప

త్రికి వెళుతున్నాం. ఇవాళ రాత్రి దాకా రాను. అమ్మాయి మూడు గంటలకే వచ్చేస్తుంది. పెళ్ళి సంగతి అడిగితే ఏం చెబుతారు?" భర్తను అడిగింది వీణ.

"ఏమో నువ్వు ఏం చెప్పమంటే అదే చెబుతా" చాలా అమాయకంగా అన్నాడు రవి.

"ఏమీ చెప్పొద్దంటా... ఏదైనా నన్నే అడగమనండి. మీరేమీ చెప్పొద్దు. ఎందుకంటే మీకు కన్విసింగ్‌గా చెప్పటం తెలీదు." అని చెప్పి కారులో కూర్చొన్న శోభను చేరుకుంది డాక్టర్ వీణ.

"హుఁ ఇంత పెద్ద మనోతత్వ వేత్తను చూసి కన్విసింగ్‌గా చెప్పటం తెలీదంటుందా? ఎంతటి అమాయకురాలు?" అనుకోవటం కన్నా ఇంకేం చెయ్యలేక పోయాడు డాక్టర్.

శోభను డ్రాప్ చేసి తన రూంకు వెళ్ళింది వీణ. పగలు పది గంటలకు ఆపరేషన్ చెయ్యవలసిన పేషంటుకు ఏదో కాంప్లికేషన్ అని ఆపరేషన్ సాయంత్రానికి పోస్ట్ పోన్ చేశారుట. నర్సు ఆవిషయం చెప్పి అప్పుడే వెళ్ళింది.అంటే ఇంకో రెండు గంటల దాకా తను ఫ్రీ. ఆలోచనలు ఆమెను గతంలోకి తీసుకెళ్ళాయి. కాలం రెండు దశాబ్దాల వెనక్కు వెళ్ళింది.

****

**ఆ** రోజు ఆస్పత్రిలో డాక్టరు వీణకు సిజేరియన్ డెలివరీ చేశారు. కవల పిల్లలు కన్నది ఆమె. ఒక ఆడ ఒక మగ. పిల్లలు చూడ ముచ్చటగా వున్నారు. కానీ మగ పిల్లవాడికి పురిటిలోనే ఇన్ఫెక్షన్ వచ్చి పుట్టిన రెండు గంటలలో చనిపోయాడు. కవల పిల్లలు కన్న ఆనందం కన్నా కన్నీళ్ళుగా మారిన దుఃఖమే ఎక్కువయింది. కనికరించ వలసిన దేవుడు కళ్ళు మూసుకున్నాడు. అందరూ బాధ పడుతూ ఉంటే డాక్టరు వీణకు ఇంకో కొత్త సమస్య పట్టుకుంది. ఈ సృష్టిలో దేవుడు చేసే కొన్ని పనులకు ఏ సైన్సు పరిజ్ఞానం కారణం చెప్పలేదు.

నర్సు తెచ్చిన పాపకు వీణ తనే పాలు పట్టింది. జీవితంలో మొట్ట మొదటిసారి ఆ క్షణంలో ఆమె స్త్రీగా సంపూర్ణత్వం పొందింది. ఆమె కడుపు పండింది... పాప కడుపు నిండింది... కానీ....

వీణ గుండెల బరువు ఇంకా తగ్గలేదు. ఆమెకు దేవుడు ఇద్దరు బిడ్డలకు సరిపడ ఆహారం ప్రసాదించాడు. కానీ తను ఒక్క బిడ్డకే దాన్ని ఇవ్వ గల్గింది చూస్తూండగానే ఆమెలో సహనం నశించి ఊపిరి పీల్చ లేనంత భారం ఎక్కువవటం మొదలయింది.

పెద్ద డాక్టరును పిలిచారు. ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని రవిని సంప్రదించి, అతడు "సరే" అన్నాక అదే నర్సింగ్ హోంలో పుట్టిన తల్లి లేని ఓ బాబుకు వీణ చేత పాలు పట్టించింది. వీణ గుండెలలోని భారం తగ్గింది. బాబు వీణ ఒడి నుండి నిద్ర ఒడిలోకి జారాడు.

ఇలా ఆ ఆస్పత్రిలో ఉన్న పది రోజులూ వీణ తన కూతురితో పాటు ఆ బాబుకు కూడా పాలిచ్చింది. ఆ బాబు పుట్టగానే అతని తల్లి చనిపోయిందిట. అతని అత్త ఆ నర్సింగ్ హోంలో మాట్రన్.

సృష్టిలో తల్లి కడుపులో జీవం పడగానే దానికి ఆహారం కూడా ప్రకృతి తయారు చేస్తుంది. కానీ ఆ బాబు విషయంలో ఒక తల్లి గర్భంలో జీవదానం ఇంకో తల్లి గుండెలపైన క్షీరపానం.

తనకింగా బాగా జ్ఞాపకం. ఆ నర్సింగ్ హోంలో ఉన్న పది రోజులలో పది పదిహేను సార్లకు పైగా తన కూతురితో బాటు ఆ బాబుకు కూడా ఒకేసారి ఆహారంగా పాలు పంచింది. ఉత్కృష్టమైన తన మాతృత్వం గురించి ఎంతో గర్వపడింది. ఆ రోజులలో అదొక గొప్ప త్యాగం అనుకుంది.

పది రోజుల తర్వాత ఆమె డిస్చార్జ్ అయిన తర్వాత ఆ బాబుకు ఏం జరిగిందో, అతడేమయ్యాడో కూడ తను ఆలోచించలా. భర్తతో అమెరికాకు వెళ్ళటం - వెళ్ళటం ఆరు సంవత్సరాల క్రితమే మళ్ళీ ఈ దేశంలో అడుగు పెట్టింది.

కానీ ఈ రోజు కృష్ణ ఇంట్లో చనిపోయిన ఆ మాట్రన్ ఫోటో చూసిన తన గుండెలలో బరువు పెరిగిపోయింది. ఒక కాలంలో తన గుండెల బరువులో పాలు పంచుకున్న ఆ బాబే ఇవాళ తనకొక సమస్యగా మారి తన గుండె మీద బరువయ్యాడు. "భగవంతుడా ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఈ పెళ్ళి ఇద్దరు ప్రేమికులకా? లేక ఓ తల్లి పాలు పంచుకున్న ఒకే గర్భంలో పుట్టని తోబుట్టువులకా?"

ఎంత సైన్సు ఒప్పుకున్నా, జ్యోతిష పండితులు, జాతకాలుసరిపోయినాయి అని ఘోషిస్తున్నా బాల్యంలో ఆ పిల్లలకు పాలిచ్చి, లాలించిన తల్లిగా ఆమె ఆ పెళ్ళికి అంగీకరించలేక పోయింది. కానీ ఆ విషయం గురించి కూతురితో మాట్లాడే ధైర్యం చాలక వాయిదా చాటున తన హిపోక్రసిని దాచుకుంది.

****

**ఆ** రాత్రి వీణ వంటింటి పనులు ముగించుకొని బెడ్‌రూంలోకి వచ్చింది. బెడ్‌రూంలో రవి చాలాసీరియస్‌గా మంచం మీద కూర్చొని ఆలోచిస్తున్నాడు. కృష్ణను చూసొచ్చిన తర్వాత ఆ ఇంట్లో మాటలకన్నా మౌనమే ఎక్కువగా ప్రతిధ్వనిస్తున్నది.

"అయితే ఆరు నెలల తర్వాత అమ్మాయికి ఏం చెపుతావు?" తాపీగా నిశ్శబ్దాని నిషేధించాడు రవి.

ఆ ప్రశ్నకు సమాధానంగా ఆమె ముఖంలోని చూపు ఓ ప్రశ్నార్థకం అయింది.

మనోతత్వ డాక్టరు ఆమె బాధ నర్థం చేసుకున్నాడు. మెల్లగా ఆమెను దగ్గరకు చేర్చుకుని ఇలా అన్నాడు.

"ఇదుగో చూడు వీణా నువ్వొక డాక్టరువి. ఆ రోజు తల్లి లేని ఓ జీవికి పాలిచ్చావు నిజమే. కానీ దాన్ని మాతృ ప్రేమ మమకారంలో ఇచ్చావా? లేదు. ఏదో నీ భారం దించుకోవటానికి అవుట్‌లెట్‌గా ఉపయోగించుకున్నావు. ఓ డాక్టరు పేషెంటుకు మందిచ్చినట్టు ఆ రోజు ఆ పిల్ల వాడికి పాలిచ్చావు. అంతేకానీ దాన్ని మాతృ ప్రేమ అనరు. ఫీజుగా ఆ బాలుడు నీకు భారం తగ్గించి మంచి రిలీఫ్ ఇచ్చాడు. ఇన్‌ఫాక్ట్ అతడే డాక్టరుగా నీకు ట్రీట్‌మెంట్ ఇస్తే నువ్వే అతనికి ఫీజుగా పాలిచ్చుకున్నావు. అవునా కాదా?"

అయోమయంగా చూసింది వీణ రవిని.

"నిజంగా అది నువ్వనుకున్నట్లు మాతృ ప్రేమే అయి ఉంటే మరి ఇన్నేళ్ళూ ఆ కుర్రాడెక్కడున్నాడో? ఎలా పెరిగాడో? ఒక్కరోజైనా తలుచుకున్నావా? నర్సింగ్ హోంను వదిలిన రోజే అతడ్ని మరిచిపోయావు. ఇప్పుడు లేనిపోని ఆలోచనలతో నీ మనస్సును పాడు చేసుకుని ఆ పిల్లల భవిష్యత్తు పాడు చెయ్యబోతున్నావు."

"మరి ఆ నిజం తెలిసి ఎలా ఊరుకో గలనండీ?"

"ఏవిటి నీకు తెలిసిన నిజం? అతడు నీకు కొడుకులా ఈ రోజు అనిపిస్తున్నాడేమో కానీ ఆ రోజు... ఓ సేవియర్."

"మన అమ్మాయి. అతడు తోబుట్టువులుగా ఎప్పుడూ అనుకోలేదు. పైగా వాళ్ళిద్దరూ ఈ రోజు ప్రేమించుకుంటున్నారు. ఈ సంగతి వాళ్ళకు తెలిస్తే అనవసరపు కన్‌ఫ్యూషన్ పెరిగి వారిద్దరి బంగారు భవిష్యత్తు, కెరీర్ పాడయ్యే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎవరికేం లాభం? కావాలంటే అతడ్ని నీ అల్లుడుగా కాకుండా నీ కొడుకుగానే చూసుకో. కానీ వాళ్ళ పెళ్ళి తర్వాత. ఏం... ఎంతమంది అత్త మామలు తమ అల్లుళ్ళను కన్న కొడుకుల్లా చూసుకోవటంలేదు? అంత మాత్రాన ఏ పాపం ఎరుగని ఆ పిల్లల మనస్సులను ఎందుకు పాడు చేస్తావ్?"

రోజూ తన మాటలకు గంగి రెద్దులాగా తలూపే భర్తలో మొట్ట మొదటిసారిగా ఒకగొప్ప ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడును చూసింది. అతని ఒళ్ళో తన తల పెట్టి భోరున ఏడ్చింది వీణ.

ఇందాకటి నుంచి ఇదంతా వింటున్న శోభ చీకట్లో మెల్లగా నడిచి తన గది చేరుకుంది.

****

**ఆ** రోజు నర్సింగ్ హోంలో తన మెయిల్‌ని చూస్తున్న వీణ దృష్టి తన కొచ్చిన ఓ కవరు మీద పడింది. చాలా చిరపరిచయమైన దస్తూరి... శోభది. ఆత్రంగా విప్పి చూసింది. లోపల లెటర్ తన కూతుర్ని ప్రేమించే కృష్ణ రాశాడు.

"నాకు బాల్యంలో పాలిచ్చి ప్రాణం పోసిన తల్లికి - శతకోటి నమస్కారములు. శోభ ద్వారా విషయం తెలిసింది. నేనూ శోభా ప్రేమించుకున్న మాట నిజమే. మేం చదువుకున్న వాళ్ళం. మా బాగోగులు తెలిసిన వాళ్ళం. ఈ మాత్రం విషయానికే జుట్టు పీక్కొని భగ్న ప్రేమికులమయిపోతాం అనుకోకండి.

అన్ని ప్రేమలూ శారీరకంగా పెళ్ళిలోనే ముడిబడాలని లేదు. కొన్ని ప్రేమలు పెళ్ళిగా మారతాయి, కొన్ని విరహంగా మారతాయి. కానీ మా ప్రేమ ఈ రోజు నుంచి అన్నాచెల్లెళ్ళ అనురాగంగా మారబోతున్నది. ఆ భగవంతుడి సాక్షిగా ఇదే మేం తీసుకున్న నిర్ణయం....

ఇట్లు

మీ ప్రియమైన సంతానం

కృష్ణ - శోభ

ఆ ఉత్తరాన్ని చూసిన వీణకు సంతోషించాలో బాధ పడాలో తెలీలా... కిటికీలో నుండి ఆకాశాన్ని చూస్తూ కూర్చుంది వీణ. నిజంగా వీళ్ళిద్దరూ స్థితప్రజ్ఞులు... మరి చిన్నప్పుడు తాగిన పాలెవరిది?... మళ్ళీ తల్లెత్తింది హిపోక్రసీ... ఆమెలో.